అన్ని వర్గాలకూ వంచన


- కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తిన వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్
- ఫీజు పోరు కరపత్రాల ఆవిష్కరణ


ఫీజు పోరు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సూర్యప్రకాశ్, పార్టీ నాయకులు

రామచంద్రపురం: ఎన్నికల్లో మోసపూరిత హామీలను ఇచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాలనూ మోసం చేసిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ధ్వజమెత్తారు. స్థానిక గాంధీపేటలోని పార్టీ కార్యాలయంలో ఈ నెల 5న పార్టీ అధిష్టానం పిలుపు మేరకు నిర్వహించే ఫీజు పోరు కార్యక్రమానికి సంబంధించి పార్టీ నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. తొలుత ఫీజు పోరు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యే సమయానికి చంద్రబాబు పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెల్లించారని గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారం చేపట్టిన చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటోందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోవటంతో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజీల నుంచి పంపించి వేస్తున్నారని, తక్షణమే ఈ పరిస్థితిని ప్రభుత్వం నివారించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఉన్న నాలుగు త్రైమాసికాల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, వసతి దీవెన కింద ఇవ్వాల్సిన రూ.3900 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు చదువు మధ్యలోనే నిలిపివేయాల్సిన దుస్థితిని ఈ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వం తక్షణమే తన వైఖరిని మార్చుకుని విద్యార్థులను ఆదుకోవాలని సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకు ఈ నెల 5న ఫీజు పోరు కార్యక్రమంలో భాగంగా అమలాపురం కలెక్టరేట్‌కు నియోజకవర్గం నుంచి తరలివెళ్లి వినతి పత్రాన్ని అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవానీ, పార్టీ నాయకుడు వాసంశెట్టి శ్యామ్, కౌన్సిలర్లు పెంటపాటి శ్రీను, పోతంశెట్టి గోపాలకృష్ణ, దుర్గారావు, కో ఆప్షన్ మెంబర్ గుబ్బల గణ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు పెట్టా శ్రీనివాసరావు, పంపన సుబ్బారావు, సత్తిశంకర్‌రెడ్డి, నియోజకవర్గంలోని కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం మండలాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలపై కేటుగాళ్ల కన్ను

- గొల్లపుంత కాలనీలో భూ దందా
- నకిలీ పట్టాలతో విక్రయాలు
- భవన నిర్మాణాలకు సైతం పాల్పడుతున్న వైనం
- అవాక్కవుతున్న అసలు లబ్ధిదారులు
- భూ బకాసురులకు అధికార పార్టీ అండదండలు


గొల్లపుంత కాలనీ

మండపేట: గొల్లపుంత అనగానే మండపేటకు మణిహారంగా మారింది. మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 123 ఎకరాలు స్థలాన్ని సమకూర్చి పేదలకు ఇళ్ల ఇచ్చేందుకు విశేష కృషి చేశారు. ఫలితంగా వేలాది మంది పేదలు ఆ కాలనీలో నివాసముంటున్నారు. ఆ పేదలంతా పట్టణంలో చిరువ్యాపారులుగానూ, దుకాణాల్లో సహాయకులుగానూ, భవన నిర్మాణ కార్మికులుగానూ, పౌల్ట్రీ, రైస్‌మిల్లు ఇతర పరిశ్రమ రంగాల్లో పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. కాలక్రమంలో ప్రభుత్వాలు పేదలకు స్థలాలను ఇస్తూ వచ్చాయి. పేదలు తమ ఓపిక మేరకు భవనాలను నిర్మించుకుంటున్నారు. సొమ్ములు ఉన్నప్పుడు భవనాన్ని నిర్మించుకుందామని స్థలాలను అలాగే వదిలేసిన యజమానులకు గట్టిదెబ్బ ఎదురైంది. ఆ స్థలాల్లోకి ఇతరులు చొరబడుతున్నారు. ఆ విషయం తెలుసుకొని వచ్చేలోపే ఆ స్థలంలో భవనాన్ని నిర్మించేస్తున్నారు. ఆ స్థలం ఎలా ఉందో చద్దామని వచ్చిన అసలు పట్టాదారులు అవాక్కవుతున్నారు.

నకిలీ పట్టాలు తయారు చేసి..

దొంగ దొంగ ఊర్లు పంచుకొని తిన్నట్టు మండపేటలోని కొందరు వ్యక్తులు ఖాళీ స్థలాలపై కన్ను వేసి భూ బకాసురులు మారారు. పట్టణంలో ఖాళీగా ఉన్న స్థలాలను ఎంపిక చేసి వాటికి నకిలీ పట్టాలు, అగ్రిమెంట్లు తయారు చేసుకొని కబ్జాలను చేస్తున్నారు. 2004 – 09 సంవత్సరం మధ్యలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి శాసన సభ్యుడు బిక్కిన కృష్ణార్జున చౌదరి పట్టణంలో 5 వేల మంది నిరుపేదలకు ఇళ్ల స్థల పట్టాలను మంజూరు చేశారు. వీటిలో 500 పట్టాలకు చెందిన స్థలాలు మటుమాయమయ్యాయి. బ్రోకర్లందరూ ఒక ముఠాగా ఏర్పడి ప్రాంతాలను పంచుకుని కబ్జా చేస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరి, ప్రజా ప్రతినిధులతో అంటకాగుతున్నారు. ఈ కబ్జాల పర్వంలో ప్రజా ప్రతినిధులను సైతం మెస్మరిజం చేసి దందాలకు పాల్పడుతున్నారు.

నిర్ఘాంతపోయిన స్థల యజమాని

పట్టణంలో ఏ ప్రాంతంలోనైనా ఖాళీ స్థలం కనబడినా అసంపూర్తి నిర్మాణాలు చేసినా వాటిపై కన్నేసి దొంగ పట్టాలు సృష్టించి అగ్రిమెంట్లు చేసి చడీచప్పుడు కాకుండా విక్రయించి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. తాజాగా గొల్లపుంత కాలనీలో దేశం నాయకులుగా చెలామణీ అవుతున్న ఇద్దరు బ్రోకర్లు ఒక స్థలంపై కన్నేసి ఆ స్థలానికి నకిలీ పట్టా సృష్టించారు. ఒక మహిళా ప్రభుత్వ ఉద్యోగికి రూ.8 లక్షలకు విక్రయించినట్టు తెలియవచ్చింది. వారిలో ఒక వ్యక్తి ఆ మహిళా ఉద్యోగి వద్ద భవన నిర్మాణానికి సంబంధించి కాంట్రాక్టు తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో అసలు స్థలం యజమాని వచ్చి తన స్థలంలో భవనాన్ని చూసి నిర్ఘాంతపోయాడు. ఈ మోసాన్ని బహిర్గతం చేయడంతో ఆ ఇద్దరి దళారీలను నిలదీశారు. పట్టణ ప్రముఖుల వద్ద మోసాన్ని వివరించగా వారు దళారీలు కాజేసిన రూ.8 లక్షలను స్థల యజమానికి ఇప్పించినట్టుగా తెలియవచ్చింది. గత కొద్ది నెలలుగా ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను కబ్జా చేస్తున్న కబ్జా రాయుళ్లను, భూ బకాసురులను అదుపు చేయక పోవటంపై ప్రజల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. ఇటువంటి బ్రోకర్లను దరి చేరనీయరాదని నాయకులను ప్రజలు కోరుకుంటున్నారు.

దివ్యాంగురాలి మృతి బాధాకరం



యండగండిలో మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జేసీ నిషాంతి

కె.గంగవరం: కపిలేశ్వరపురం మండలం అంగరలో దివ్యాంగురాలు నడవపల్లి భద్రం ఆర్టీసీ బస్సు కింద జారిపడి మృతి చెందడం బాధాకరమని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి విచారం వ్యక్తం చేశారు. కె.గంగవరం మండలం యండగండిలో మృతురాలి కుమారుడు దుర్గాప్రసాద్, ఇతర కుటుంబ సభ్యులను శనివారం జేసీ పరామర్శించారు. యండగండిలో మృతురాలికి గతంలో ఇళ్ల స్థలం మంజూరు కావడంతో అక్కడే ఇల్లు కట్టుకుందామని తలచేదన్నారు. తాత్కాలికంగా అంగరలో ఉంటున్న భద్రం ప్రమాదంలో మృతి చెందడం కలచివేసిందన్నారు. ప్రభుత్వం నుంచి ఆమె కుటుంబానికి సహాయ సహకారాలను అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆమె వెంట రామచంద్రపురం ఆర్డీఓ దేవరకొండ అఖిల, తహసీల్దార్ బి.మృత్యుంజయరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

స్ఫూర్తిని నింపేందుకే సైన్స్ ప్రయోగాలు

రాయవరం: విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకే నూతన ప్రయోగాలకు వేదికగా సైన్స్ ప్రదర్శనలు ఎంతగానో ఉపకరిస్తాయని జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం రాయవరం సాయితేజా స్కూల్లో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రయోగాలను ఆయన తిలకించారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గుర్తించి వారిని ప్రోత్సహిస్తే వారు మరిన్ని అద్భుతాలు సాధిస్తారన్నారు. ఈ సందర్భంగా అనపర్తి, బిక్కవోలు ఎంపీడీవోలు మండ రామకృష్ణారెడ్డి, వి.శ్రీనివాసరావు, డాక్టర్ జీఎస్ఎన్‌రెడ్డి, డాక్టర్ కృష్ణారెడ్డి, తదితరులు సైన్స్ ప్రదర్శనలను తిలకించి, విద్యార్థులను అభినందించారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి జాతర ప్రారంభం


వాడపాలెంలో దేవతామూర్తుల రూపంలో విద్యుత్ సెట్టింగ్

కొత్తపేట: మండలంలోని వాడపాలెంలో సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బండారు వారి ఆడపడుచుగా విరాజిల్లుతున్న సత్తెమ్మతల్లి ఆరో వార్షికోత్సవ జాతర మహోత్సవాలు నాలుగు సంవత్సరాల అనంతరం జరుగుతున్నాయి. ఆది నుంచీ ఉత్సవ నిర్వాహకుడు చింతపల్లి బాలు, జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సింగిరెడ్డి గోవిందుస్వామి, కట్టా శ్రీను తదితరుల ఆధ్వర్యంలో స్థానికులు, స్థానికేతర ప్రాంతాల్లో స్థిరపడిన స్థానికుల సహకారంతో భారీ ఖర్చుతో ఉత్సవాలు చేపట్టారు. గ్రామ ముఖద్వారం బస్టాండ్ నుంచి వానపల్లి రోడ్డు, మార్కెట్, సుభాష్‌చంద్రబోస్ విగ్రహం, బజారు వీధి, అమ్మవారి ఆలయం గుండా తిరిగి బస్టాండ్ వరకూ భారీ ఎత్తున విద్యుదీకరణ, వివిధ రకాల సెట్టింగులు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ ఉత్సవాలతో గ్రామం కొత్త కళతో కళకళలాడుతుంది. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాన్ని ఆద్యంతం కనుల విందుగా నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ జరిపారు. ఈ కార్యక్రమాల్లో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సాహిత్య పఠనంపై అవగాహన పెంచుకోవాలి


బాల మందిరం కార్యక్రమంలో విద్యార్థులతో రచయిత కృష్ణశ్రీ తదితరులు

ఆలమూరు: విద్యార్థులందరూ మాతృభాషపై మమకారం పెంచుకుని సాహిత్య పఠనంపై అవగాహన పెంచుకోవాలని సాల్క్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు, ప్రముఖ కవి, రచయిత అంగర గోపాలకృష్ణచార్యులు (కృష్ణశ్రీ) అన్నారు. మండలంలోని సంధిపూడిలోని ఎంపీయూపీ పాఠశాలలో శనివారం బాలమందిరం సాహిత్య కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు సాహిత్య పఠనం, కథా వస్తువు తయారీ, భాషా నైపుణ్యం నాటకీకరణ, గేయ రచనలపై ఆయన అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన కల్పించుకున్న విద్యార్థులే రచయిత చెప్పిన కథాంశాన్ని ఆధారంగా చేసుకుని రచనలు చేసుకున్న విధానం అందరినీ ఆకట్టుకుంది.

సూర్యఘర్ యోజనను సద్వినియోగం చేసుకోండి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఈ రాజబాబు

మలికిపురం: పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ రాజబాబు సూచించారు. మలికిపురం పంచాయతీ వద్ద శనివారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఈ పథకంలో వినియోగదారులకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ కూడా కూడా వెంటనే జమ అవుతుందన్నారు. అలాగే వినియోగదారులు వాడుకోగా మిగిలిన విద్యుత్‌ను ట్రాన్స్‌కో కొనుగోలు చేసి వెంటనే బిల్లు చెల్లిస్తుందన్నారు. ద్వారా బ్యాంకు రుణాన్ని ఈజీగా తీర్చుకోవచ్చన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ ఈ పథకంలో 12 జంటలను ఎంపిక చేసి రిపబ్లిక్ డే పరేడ్‌కు ప్రభుత్వం ఖర్చులతో పంపగా ప్రధాని మోదితో భేటీ అయ్యారని ఆయన అన్నారు. మలికిపురంలో గ్రామానికి టార్గెట్ ఇచ్చామని టార్గెట్ రీచ్ అయితే గ్రామానికి కోటి రూపాయల గ్రాంట్ వస్తుందని, దాంతో గ్రామం అభివృద్ధి అవుతుందన్నారు. సమావేశంలో ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, భారత ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ దొడ్డా నాగబాబు, డీఈ టెక్నికల్ విజయానంద్, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ బి.ప్రసాద్, ఎంపీటీసీలు జక్కంపూడి శ్రీదేవి, కొప్పిశెట్టి సీతామహాలక్ష్మి, నాయకులు గెద్దం తులసీ భాస్కరరావు, ఇందుకూరి అచ్యుత రామరాజు తదితరులు పాల్గొన్నారు.

డీఐజీ మృతికి సంతాపం

మలికిపురం: ఇటీవల మృతి చెందిన స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాదవత్తుల శివరామ్‌కు మలికిపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. సబ్ రిజిస్ట్రార్, వి.వేంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ వి.అరుణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ రమేష్, ఆఫీసు సిబ్బంది, మలికిపురం దస్తావేజులు లేఖరులు కోళ్ళ రాంబాబు, కంచుస్తంభం వాసు, మురళీ కృష్ణ సహాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విద్యార్థులకు అండగా ఉంటాం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ తోట, పక్కనే పార్టీ నాయకులు

- 5న జరిగే నిరసనకు విద్యార్థులు, పార్టీ శ్రేణులు తరలి రావాలి
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వైఎస్సార్ సీపీ ఫీజు పోరు పోస్టర్ ఆవిష్కరణ

మండపేట: ఫీజు రీయంబర్స్‌మెంట్, వసతి దీవెన వంటి పథకాలు వెంటనే అమలు చేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ ఈ నెల ఐదో తేదీన చేపట్టే వైఎస్సార్ సీపీ ఫీజుపోరు నిరసన కార్యక్రమాన్ని చేపట్టనుంది. ఈ నిరసనకు విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు వేలాదిగా తరలి వచ్చి విద్యార్థి లోకానికి అండగా నిలబడాలని శాసన మండలి సభ్యుడు తోట త్రిమూర్తులు పిలుపునిచ్చారు. ఈ మేరకు విజయలక్ష్మి నగర్‌లోని వైఎస్సార్ కార్యాలయంలో శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ఫీజుపోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తోట త్రిమూర్తులు మాట్లాడుతూ తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని విద్యార్థులందరికీ అండగా నిలబడేందుకు వైఎస్సార్ సీపీ ఫీజుపోరు కార్యక్రమానికి పిలుపు నిచ్చారన్నారు. ఆయన ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఫిబ్రవరి 5న నిరసన గళం విప్పనున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం హామీల అమలులో ప్రజలకు మొండి చేయి చూపించిందని విమర్శించారు. విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయక, వసతి దీవెన అమలు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. కూటమి ప్రభుత్వంలో విద్యార్థులు కాలేజీల నుంచి గెంటించుకునే దుస్థితి ఎదురవడం దారుణమన్నారు. విద్యార్థి పక్షాన నిలబడేందుకు వైఎస్సార్ సీపీ ముందుంటుందన్నారు. నిరసన కార్యక్రమానికి విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని తోట పిలుపునిచ్చారు. మాజీ సర్పంచ్ సలాది వీరబాబు, పార్టీ నాయకులు మాకా వీర వెంకటసత్యనారాయణమూర్తి, సుంకర వీరబాబు, సలాది రామకృష్ణ, పి.రాజశేఖర్, యరమాటి వెంకన్నబాబు, టపా పుల్లేశ్వరరావు, టి.అశోక్, సత్యనారాయణ, బి.అంజి తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామిని దర్శించిన తోట


తోట త్రిమూర్తులు, పృథ్వీరాజ్‌లను సత్కరించి చిత్రపటం బహూకరిస్తున్న కమిటీ సభ్యులు

మండపేట: ద్వారపూడి శివారు వేములపల్లిలో శనివారం అభయాంజనేయ స్వామి విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తోట త్రిమూర్తులు, ఆయన తనయుడు యువనేత తోట పృథ్వీరాజ్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఇరువురిని దుశ్శాలువాలతో సత్కరించి, స్వామి వారి చిత్రపటాన్ని అందించారు. గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన 30 అడుగుల ఎత్తు గల స్వామి విగ్రహం ప్రారంభానికి హనుమాన్ భక్తులు, గ్రామస్తులు భారీగా తరలి వెళ్లారు. అనంతరం అన్నప్రసాదాలను స్వీకరించారు. మేడపాడు ఎంపీటీసీ సభ్యుడు దేవు ప్రసాద్ నాయుడు, తులా శేషారావు, పోతుల రాంబాబు, అడబాల బాబ్జి, సత్తి సత్తిబాబు, గోవిశెట్టి ఆంజనేయులు, పాండ్రంకి జటాధరుడు, పోతుల ప్రసాద్, పాండ్రంకి మహేష్, తోరం శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

తక్కువ ప్రీమియం, ఎక్కువ బోనస్‌తో తపాలా జీవిత బీమా


పీఎల్ఐ పథకం ప్రయోజనాలను వివరిస్తున్న కామేశ్వరరావు

- రామచంద్రపురం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కామేశ్వరరావు
- ఘనంగా పీఎల్ఐ వార్షికోత్సవం

మండపేట: తక్కువ ప్రీమియం చెల్లించి ఎక్కువ బోనస్ అందించే ఏకైక బీమా తపాలా జీవిత బీమా అని రామచంద్రపురం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ పీ కామేశ్వరరావు అన్నారు. మండపేట ఆంధ్రాబ్యాంకు పక్కన ఉన్న తపాలా శాఖ ప్రధాన కార్యాలయంలో శనివారం పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్ఐ) వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పీఎల్ఐ ప్రవేశపెట్టి 141 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పోస్ట్‌మాస్టర్ కొండపల్లి సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కామేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కటింగ్ చేసి ఉద్యోగులకు పంచారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ తక్కువ ప్రీమియం అధిక బోనస్ అందించే ఏకైక బీమా సౌకర్యం తపాలా శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. దేశంలోనే అత్యంత పురాతన పథకంగా పీఎల్ఐకు గుర్తింపు ఉందన్నారు. అయితే కేవలం ప్రభుత్వం ఉద్యోగులకు మాత్రమే వర్తించేలా ఉండే ఈ పథకాన్ని తపాలా శాఖ విద్యావంతులకు కూడా వర్తించేలా అప్‌డేట్ చేసిందన్నారు. ఇక నుంచి డిగ్రీ, డిప్లొమా, ఐటీలు కోర్సులు పూర్తి చేసి ఆర్థికంగా పర్వాలేదు అనుకున్న వారికీ ఈ బీమా వర్తిస్తుందని తెలిపారు. తక్కువ మొత్తంలో పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తంలో ఆర్థిక భరోసా కల్పించడం ఈ బీమా ముఖ్య ఉద్దేశమన్నారు. ఏ ఇతర బీమా సంస్థల ఇవ్వని రిటర్న్‌ను తపాలా జీవిత బీమా అందిస్తుందని వివరించారు. అనంతరం మండపేట పోస్ట్ ఆఫీస్ అన్ని విభాగాల్లోనూ విశిష్ట ప్రతిభ కనపరుస్తూ ముందుకు తీసుకుని వెళుతున్న కేవీ నారాయణరావు, కొండపల్లి సూర్యనారాయణలను ఆయన ప్రశంసించారు. విశ్రాంత ఉద్యోగి టీ పుల్లేశ్వరరావు, తపాలా ఉద్యోగులు ఎండీఎం షరీఫ్, సీహెచ్ శ్రీనివాస్, జీ వెంకట్రావు, ఎం.అనూష, సిద్ధిరెడ్డి దుర్గాదేవి, ఏ అనూష, కే ఈశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక జీవన స్థితిగతులపై అధ్యయనం


పినపళ్లలో సామాజిక, ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం చేస్తున్న ప్రత్యేక బృందం

ఆలమూరు: మండలంలోని పినపళ్లలో శనివారం సామాజిక, ఆర్థిక, జీవన స్థితిగతులు, ఆలయాల విశిష్టత, గ్రామ చారిత్రక నేపథ్యంపై అధ్యయనం జరిగింది. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారి డాక్టర్ రవికుమార్ నేతృత్వంలో ఆరుగురు బృందం గ్రామానికి చేరుకుంది. సర్పంచ్ సంగిత సుభాష్, గ్రామ కార్యదర్శి ఎస్.వీర్రాజు సహకారంతో గ్రామ సచివాలయ ఉద్యోగులతో కలసి ఇంటింటికి వెళ్లి ప్రజల నుంచి వివరాలను సేకరించింది. అన్ని కులాలకు సంబంధించి 20 కుటుంబాలను కలసి గత 25 ఏళ్ల నుంచి గుర్తున్న సమగ్ర సమాచారాన్ని సేకరించి నివేదికను పొందుపర్చుకుంది. గ్రామ రెవెన్యూ అధికారి బుంగ ఉదయ్‌కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగరాజు, ఏఎన్ఎం కె.వెంకాయమ్మ, మహిళ సంరక్షణ కార్యదర్శి కె.లక్ష్మీ నారాయణమ్మ, అగ్రికల్చరల్ అసిస్టెంట్ మౌనిక, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విభజన జరిగిన తరువాత ఏర్పడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని గ్రామాలకు సంబంధించి సమగ్రమైన వివరాలు లేకపోవడంతో ఈ అధ్యయనం చేపట్టినట్లు ప్రత్యేక అధికారి రవికుమార్ వెల్లడించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో మార్చి నెలాఖరు నాటికి సామాజిక స్థితిగతులపై సర్వేను పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. గ్రామస్థాయిలో ఆర్థిక స్థితిగతులపై వివరాలు సేకరించేందుకు సహకరించిన గ్రామస్తులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల గ్రామ సచివాలయాల పరిధిలో ఆరోగ్య సిబ్బంది శనివారం చిన్నారులకు టీకాలు అందజేశారు. వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, డి.సాయికిషోర్ ఆధ్వర్యంలో ఆలమూరు–2, కలవచర్ల, పెదపళ్ల, చింతలూరు, కలవచర్ల, చొప్పెల్ల, మోదుకూరు, మడికి, మూలస్థాన అగ్రహారం తదితర గ్రామాల్లో అనేక మంది చిన్నారులకు ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది టీకాలను వేశారు. ఈ టీకాల ప్రక్రియను ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈలు బి.సూర్యనారాయణ, ఏవీవీ రాజా అక్కుల, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పర్యవేక్షించారు. చిన్నారులకు ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు పెంటా వాలెంట్, ఎంఆర్, టీటీ, డీపీటీ, హెపటైటిస్–బీ వ్యాక్సిన్లను అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫ్లోర్ లీడర్‌గా బోస్ ఎంపికపై హర్షం

కాజులూరు: పార్లమెంట్ ఫ్లోర్ లీడర్‌గా వైఎస్సార్ సీపీ నేత, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్‌చంద్రబోస్ ఎంపిక కావటంపై మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం తణుకువాడలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడుతూ చెట్లు ఎక్కే శెట్టిబలిజలను పార్లమెంట్ మెట్లు తొక్కేలా చేసిన ఘనత వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎంపీ విజయసాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన పార్టీ పార్లమెంట్ ఫ్లోర్ లీడర్ పదవిని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్‌చంద్రబోస్‌కు కేటాయించి బీసీల పట్ల ఆయనకు ఉన్న చిత్తశుద్ధిని జగనన్న మరోసారి నిరుపించుకున్నారన్నారు. బీసీ నాయకులు దంగేటి వెంకన్న, టేకుమూడి శంకర్, ఉప్పుమిల్లి సర్పంచ్ పెంకే సత్యనారాయణ, మండల ఎస్సీసెల్ నాయకుడు నున్న లక్ష్మణరావు, జొన్నకూటి వెంకటేశ్వరావు హర్షం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

నీటి సరఫరాకు నేడు అంతరాయం

రామచంద్రపురం: మున్సిపాలిటీ పరిధిలోని వార్డు ప్రజలకు వెల్ల నీటి ప్రాజెక్టు నుంచి వచ్చే మంచినీటి సరఫరాలో ఆదివారం అంతరాయం కలుగుతుందని కమిషనర్ అయ్యప్పనాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో మెయింటినెన్స్ పనుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, దీని కారణంగా వెల్ల ప్రాజెక్టు నీటి సరఫరా కూడా నిలిచిపోతుందని తెలిపారు. పట్టణ ప్రజలు విషయాన్ని గమనించి నీటిని పొదుపుగా వాడుకోవాలని కమిషనర్ సూచించారు.

అంగరలో సత్తెమ్మ జాతర

కపిలేశ్వరపురం: అంగరలో శనివారం సత్తెమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మేడిశెట్టి కుటుంబీకులు అమ్మవారిని ఆరాధ్య దైవంగా కొలుస్తారు. గ్రామంలోని అమ్మవారిని ఊరేగించారు. ఆడపడుచులు మొక్కులు తీర్చుకున్నారు.

గీత కార్మికులకు మద్యం షాపులు కేటాయించాలి

కాజులూరు: గీత కార్మికులకు మద్యం షాపులు కేటాయించాలని మండల గీత కార్మిక సంఘం నాయకుడు పెంకే సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం కాజులూరులో ఆయన మాట్లాడుతూ గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపులు కేటాయిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ లెక్కన తాళ్లరేవు ఎక్సైజ్ డివిజన్ పరిధిలోని కాజులూరు మండలంలో ఒక షాపు కెటాయించాల్సి ఉందన్నారు. కాగా తాళ్లరేవు డివిజన్‌కు ఒక్క షాపు కూడా కేటాయించలేదన్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి మండలంలో గీతకార్మికులకు మద్యం షాపు కేటాయించాలని కోరారు.

ఉత్సాహంగా బేటీ సమ్మాన్ ర్యాలీ


ర్యాలీని ప్రారంభిస్తున్న ఏఎస్సై మల్లికార్జున్

రామచంద్రపురం: స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక శ్రీచైతన్య విద్యార్థులు శనివారం రామచంద్రపురం మెయిన్ రోడ్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఏఎస్సై మల్లికార్జున్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు మహిళలను గౌరవించాలని, మహిళలను చిన్న చూపు చూడకూడదని, మహిళా శక్తి దేశానికి రక్ష అంటూ నినాదాలు చేస్తూ బ్యాంక్ సెంటర్ నుంచి రాజగోపాల్ సెంటర్ వరకూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కె.రాము మాట్లాడుతూ మహిళలను గౌరవించాలని, రక్షించాలని సూచించారు. మహిళలు పురుషులతో పాటు అన్ని రంగాలలో ముందంజలో ఉంటున్నారని, అటువంటి మహిళలను ఆదర్శంగా తీసుకోవాలని తెలియచేసే ఉద్దేశంతో ఈ ర్యాలీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడిగా త్రినాథరెడ్డి

రాయవరం: స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో శనివారం మండల విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం నిర్వహించారు. సంఘం నూతన అధ్యక్షుడిగా సత్తి త్రినాథరెడ్డిని సంఘం గౌరవ అధ్యక్షుడు జి.చిట్టిబాబా ప్రతిపాదించగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని త్రినాథరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి వై.సూర్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చెల్లూరులో నేడు గంధోత్సవం

రాయవరం: చెల్లూరు గ్రామంలో ఆదివారం హజరత్ జంగిల్ పీర్ బాబా గంధోత్సవం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. శనివారం చెల్లూరులో గంధోత్సవ నిర్వాహకులు మాట్లాడుతూ జంగిల్ పీర్ బాబా గంధోత్సవంలో చెల్లూరు పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొని మెక్కులు తీర్చుకోవాలని కోరారు.